క్లుప్తంగా

మహిళా సదస్సును విజయవంతం చేయాలి

మహబూబాబాద్ అర్బన్/కేసముద్రం: ఈనెల 10న జిల్లా కేంద్రంలో టీపీటీఎఫ్ కార్యాలయంలో సావిత్రి బాయి పూలే విగ్రహావిష్కరణను, మహిళా సదస్సును విజయవంతం చేయాలని టీపీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి సిద్దోజు కవిత పిలుపునిచ్చారు. మహిళా సదస్సును విజయవంతం చేయాలని జిల్లా కేంద్రంలోని మోడల్ స్కూల్, బీసీ, ఎస్సీ, సోషల్ వెల్ఫేర్, ఫార్మసీ కళాశాల, ఏకలవ్య పాఠశాలలో కరపత్రాలను మంగళవారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో మోడల్ స్కూల్స్ ప్రిన్సిపాల్ డి.అమరావతి, నాయకులు రమేష్, ఉపేందర్, సువరణ, గిరిజ, అనిత, కవిత, హరిణి, యాకయ్య, బాబురావు, నరేష్ పాల్గొన్నారు.

డీఆర్డీఓ శాస్త్రవేత్తగా భరత్ కుమార్ ఎంపిక



మహబూబాబాద్ రూరల్: జిల్లా కేంద్రానికి చెందిన ప్రముఖ న్యాయవాది పుల్లూరు కృష్ణయ్య, భాగ్యలక్ష్మి దంపతుల కుమారుడు పుల్లూరు భరత్ కుమార్ చెన్నై డీఆర్డీఓలో శాస్త్రవేత్త (గ్రూప్–ఏ గెజిటెడ్ ఆఫీసర్) గా ఎంపికయ్యాడు. తల్లిదండ్రులు సంతోషాన్ని వ్యక్తం చేయగా న్యాయవాదులు తుంపిళ్ల శ్రీనివాస్, ఎస్కే.పాషా, దర్శనం రామకృష్ణ, తదితరులు భరత్‌కుమార్‌ను సన్మానించి అభినందనలు తెలిపారు.

బాధ్యతల స్వీకరణ



మహబూబాబాద్: మానుకోట డీపీఆర్ఓ పసునూరి రాజేంద్ర ప్రసాద్ మంగళవారం బాధ్యతలను స్వీకరించారు. కాగా రాజేంద్రప్రసాద్ కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్‌ను, అదనపు కలెక్టర్ ఎం.డేవిడ్‌ను మర్యాద పూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

వీరభద్రస్వామిని దర్శించుకున్న డీపీఆర్ఓ

కురవి: మండల కేంద్రంలోని భద్రకాళీ సమేత శ్రీ వీరభద్రస్వామిని డీపీఆర్ఓ రాజేంద్రప్రసాద్ మంగళవారం దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు.

దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ అర్బన్: హైదరాబాద్ పబ్లిక్ స్కూల్ బేగంపేట, రామంతాపూర్‌లో 2024–25 విద్యా సంవత్సరానికి ఒకటో తరగతి ఇంగ్లిష్ మీడియం నాన్ రెసిడెన్షియల్‌లో ప్రవేశాల కోసం అర్హులైన గిరిజన విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు డీటీడీఓ ఎర్రయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యార్థులు 1–06–2017నుంచి 31–05–2018లోపు జన్మించిన వారై ఉండాలన్నారు. ఆదాయం, జనన, కుల, నివాస ధ్రువీకరణ పత్రాలు, విద్యార్థుల 3పాస్‌ఫొటోలతో దరఖాస్తులను ఈనెల 11న సాయంత్రం 5గంటలలోపు గిరిజన కార్యాలయంలో సమర్పించాలన్నారు. పట్టణ ప్రాంతాల్లోని విద్యార్థుల తల్లిదండ్రుల వార్షిక ఆదాయ రూ.2లక్షలు, గ్రామీణ ప్రాంతాల వారి ఆదాయం రూ.1.50లక్షలు మించొద్దన్నారు. కాగా ఈ నెల 14న ఉదయం 11గంటలకు కలెక్టరేట్‌లో లాటరీ పద్ధతిలో నిర్వహించే ఎంపికకు తల్లిదండ్రులు హాజరుకావాలన్నారు.

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం ద్వారా..

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యా నిధి పథకం ద్వారా 2024–25 విద్యా సంవత్సరంలో విదేశాల్లోని విద్యాలయాల్లో పోస్టు గ్రాడ్యుయేషన్ ప్రవేశాలకు అర్హులైన ఎస్సీ విద్యార్థుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా షెడ్యూల్ కులాల అభివృద్ధి ఇన్‌చార్జ్ అధికారి అధికారి ఆర్. బాలరాజు మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. యూకే, యూఎస్ఏ, ఆస్ట్రేలియా, కెనడా, సింగపూర్, జర్మనీ, జపాన్, దక్షిణకొరియా, న్యూజిలాండ్ దేశాల్లో ఉన్నత విద్యనభ్యసించవచ్చన్నారు. ఎంపికైన విద్యార్థులకు రాష్ట్ర ప్రభుత్వం రూ.20లక్షల స్కాలర్‌షిప్ అందిస్తుందని, ఈ నెల 31 వరకు సంబంధిత వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. పూర్తి వివరాలకు 98499 43887, 94401 20620 ఫోన్ నంబర్లలో సంప్రదించాలన్నారు.

సీఎం ఫ్లెక్సీకి పాలాభిషేకం



మహబూబాబాద్: ఒకటో తేదీన జీతాలు రావడం సంతోషంగా ఉందని, గతంలో జీతం ఎప్పుడు వస్తుందో అని ఎదురు చూసే వాళ్లమని నాల్గో తరగతి ఉద్యోగుల సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి నలమాస శంకర్ అన్నారు. సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఆవరణలో సీఎం రేవంత్‌రెడ్డి ఫ్లెక్సీకి పాలాభిషేకం చేశారు. రావాల్సిన 3డీఏలను కూడా వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో దాసరి లక్ష్మి, మురళీకృష్ణ, లక్ష్మి, లత, భాగ్య పాల్గొన్నారు.

పనులు త్వరగా పూర్తి చేయాలి



కల్యాణ మండపం పరిశీలిస్తున్న ఎమ్మెల్యే రాంచంద్రునాయక్

కురవి: ఈనెల 8వ తేదీ మహాశివరాత్రి నుంచి నిర్వహించే భద్రకాళీ సమేత శ్రీవీరభద్రస్వామి కల్యాణ మహోత్సవ జాతర పనులను ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ మంగళవారం పరిశీలించారు. నాగేంద్రస్వామి ఆలయ ఆవరణలో ఏర్పాటు చేస్తున్న బారికేడ్లు, కల్యాణ మండపాన్ని పరిశీలించారు. కల్యాణ వేదికకు మూలన సాంస్కృతిక కార్యక్రమాలు ఏర్పాటు చేయాలని సూచించారు. విద్యుత్ షాక్ రాకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. పశువుల సంతలో మరుగుదొడ్లు, భక్తులు ఉండేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు వివరించారు. పనులు వేగవంతంగా పూర్తి చేయాలని ఎమ్మెల్యే ఆదేశించారు.

దేవాలయ భూములను కాపాడాలి

దేవాలయ భూములను కాపాడాలని ఎమ్మెల్యే ఆదేశించారు. కైలాస భవనం గుట్ట ఎక్కి భూములను పరిశీలించారు. ఆలయ భూములు అన్యాక్రాంతం కాకుండా చూడాలన్నారు. చెరువు కింద ఉన్న ఆలయ భూములను పరిశీలించి, కట్టపైకి రోడ్డుకు ఇరువైపులా రాళ్లతో నిర్మించాలని సూచించారు. కైలాసభవనం పక్కన ప్రభుత్వ భూములు ఎన్ని ఉన్నాయి? వాటిని గుర్తించి హద్దులు నిర్ణయించాలని తహసీల్దార్‌ను ఆదేశించారు. జర్నలిస్టుల ఇళ్లను పరిశీలించారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ సత్యనారాయణ, చైర్మన్ కొర్ను రవీందర్‌రెడ్డి, ఆలయ మాజీ చైర్మన్ బాదావత్ రామునాయక్, ధర్మకర్తలు బాలగాని శ్రీనివాస్, చిన్నం గణేష్, శక్రు, వెంపటి శ్రీను, ఉప్పలయ్య, సంజీవరెడ్డి, భిక్షపతి, మండల అధ్యక్షుడు అంబటి వీరభద్రం, నాయకులు రాజేందర్‌కుమార్, ఎర్రనాగేశ్వర్‌రావు, మోహన్ రావు, వినయ్, భిక్షమయ్య, లక్ష్మణ్ పాల్గొన్నారు.

అర్హులైన పేదలకు పట్టాలు ఇవ్వాలి



ఆందోళన చేస్తున్న నాయకులు, కాలనీవాసులు

మహబూబాబాద్: అర్హులైన పేదలకు జీఓ 58 క్రింద పట్టాలు ఇవ్వాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యుడు సూర్నపు సోమయ్య డిమాండ్ చేశారు. సీపీఎం పట్టణ కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట పేదలు ధర్నా చేశారు. ఈసందర్భంగా సోమయ్య మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలోని పలు కాలనీలకు చెందిన పేదలు పట్టాలు ఇవ్వాలని దరఖాస్తులు చేసుకున్నా నేటికీ ఇవ్వలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పట్టాలు లేని కారణంగా ఇంటి నంబర్లు లేక అనేక సమస్యలు ఎదురవుతున్నాయన్నారు. వెంటనే ఇంటి పట్టాలు ఇవ్వాలని లేని యెడల ఆందోళన తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. అనంతరం తహసీల్దార్ భగవాన్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు సమ్మెట రాజమౌళి, హేమానాయక్, శ్రీనివాస్, ఉపేంద్ర, అనిత, కళావతి, రెహానా, రషీ పాల్గొన్నారు.

ట్రేడ్ లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకోవాలి

మహబూబాబాద్: ఈనెల 31లోపు వ్యాపారులు ట్రేడ్ లైసెన్స్‌లు రెన్యువల్ చేసుకోవాలని మున్సిపల్ కమిషనర్ నోముల రవీందర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. లైసెన్స్ కాలం ఈనెల 31తో ముగుస్తుందన్నారు. రెన్యువల్ చేసుకోకపోతే ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నిబంధనల ప్రకారం పునరుద్ధరణ ధరను చెల్లించిన తర్వాత ట్రేడ్ లైసెన్స్ ఆటోమెటిక్‌గా పునరుద్ధరించబడుతుందని తెలిపారు. ఈనెలలో రెన్యువల్ చేసుకోవడంలో విఫలమైతే అదనంగా మరింత జరిమానా చెల్లించాల్సి వస్తుందన్నారు. ఈనెల 31లోపు ఎలాంటి జరిమానా లేకుండా ఏప్రిల్ నుంచి జూన్ 31వరకు 25శాతం జూలై తర్వాత 50శాతం జరిమానాతో చెల్లించాల్సి వస్తుందని పేర్కొన్నారు. మీసేవ కేంద్రాలలో గాని నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లించవచ్చన్నారు.

డోర్నకల్: డోర్నకల్ మున్సిపాలిటీ పరిధిలోని వ్యాపారులు తమ ట్రేడ్ లైసెన్సులను రెన్యువల్ చేయించుకోవాలని మున్సిపల్ కమిషనర్ నరేష్‌రెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ.. 2023–24 సంవత్సరానికి లైసెన్స్ గడువు ఈనెల 31వ తేదీతో ముగియనుందని తెలిపారు. ఏప్రిల్ 1వ తేదీ తర్వాత 25శాతం అపరాధ రుసుముతో రెన్యువల్ చేయించుకోవాలని కమిషనర్ తెలిపారు.

8న శ్రామిక మహిళా సదస్సు

నెహ్రూసెంటర్: అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలోని భట్టు అంజయ్య భవన్‌లో ఈనెల 8వ తేదీన శ్రామిక మహిళా సదస్సును నిర్వహిస్తున్నట్లు పీఓడబ్ల్యూ జిల్లా కోశాధికారి సామ రజిత మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మానవత్వం చాటుకున్న దాతలు

- బాధిత కుటుంబానికి రూ.3లక్షల ఆర్థికసాయం



ఫిక్స్‌డ్ బాండ్‌ను అందజేస్తున్న రాజేష్, తదితరులు

కేసముద్రం: మండలంలోని కల్వల గ్రామానికి చెందిన ముప్ప ఉమేష్ అనే వ్యక్తి ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. పేదరికంలో మగ్గుతున్న ఆ కుటుంబంలో ఇంటిపెద్ద దిక్కు కోల్పోవడంతో భార్య అనూష, ఇద్దరు కూమార్తెలు ఒంటరయ్యారు. ఈ క్రమంలో ఇదే గ్రామానికి చెందిన ఎస్ఎస్ ట్యుటోరియల్స్, హైదరాబాద్ నిర్వాహకుడు బొగ్గుల రాజేష్ మానవత్వంతో ముందుకు వచ్చాడు. తన మిత్రులైన పాడేటి దినేష్, మార్గం విష్ణు, గండి సాయిచరణ్, మహేందర్, బొగ్గుల శ్రీధర్, శశికుమార్‌ల సహకారంతో పేద కుటుంబాన్ని ఆదుకోవాలంటూ సోషల్ మీడియా ద్వారా కోరాడు. ఈమేరకు ఫ్యూచర్ కిడ్స్ స్కూల్, హైదరాబాద్‌కి చెందిన తోటి ఉపాధ్యాయులు, మిత్రులు, పలువురు గ్రామస్తులు ఆర్థికసాయం అందజేశారు. మొత్తంగా రూ.3,18,000 జమ అయ్యాయి. మృతుడి ఇద్దరు కూమార్తెలు మన్విత(5), నిత్యశ్రీ(3) పేరున ఫిక్స్‌డ్ చేసిన రూ.3లక్షల బాండ్‌ను మృతుడి భార్యకు మంగళవారం అందజేశారు. అదే విధంగా రూ.18వేలతో నిత్యావసరాలను అందించారు. బొగ్గుల రాజేష్‌ను గ్రామపెద్దలు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గంట సంజీవరెడ్డి, బొగ్గుల నాగయ్య, చింతనూరి వెంకన్న, చందాగోపి, గండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

మహిళలు అన్నిరంగాల్లో రాణించాలి



మాట్లాడుతున్న సీడీపీఓ హైమావతి

పెద్దవంగర: ప్రస్తుత ఆధునిక ప్రపంచంలో మహిళలు ఎన్నెన్నో అద్భుతాలు సాధిస్తున్నారని ఐసీడీఎస్ సీడీపీఓ హైమావతి అన్నారు. మంగళవారం మండలంలోని గంట్లకుంట గ్రామంలోని అంగన్‌వాడీ కేంద్రంలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని కిశోర బాలికలు, మహిళలతో సమావేశం నిర్వహించారు. ఈసమావేశంలో బేటీ బచావో–బేటీ పడావో, భ్రూణహత్యలు, శిశువు లింగనిర్ధారణ పరీక్షలు, మహిళా చట్టాలు, బాల్య వివాహాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో డాక్టర్ హరిప్రియ, అంగన్‌వాడీ టీచర్లు, స్వరూప, ఇందిర, ఏఎన్ఎం ఈశ్వరీ, ఆశలు శోభరాణి, అంగన్‌వాడీ ఆయాలు బుచ్చమ్మ, ఉప్పలమ్మ పాల్గొన్నారు.

పోటీ ప్రపంచంలో ముందుండాలి



ప్రశంస పత్రాలను అందిస్తున్న తహసీల్దార్

నెల్లికుదురు: మారుతున్న కాలానికి అనుగుణంగా విద్యార్థులు తమను తాము ఉన్నతీకరించుకొని పోటీ ప్రపంచంలో ముందుండాలని తహసీల్దార్ కోడిచింతల రాజు సూచించారు. స్థానిక ఆదర్శ పాఠశాలలో మంగళవారం ఏర్పాటు చేసిన అటల్ టింకరింగ్ ల్యాబ్ ఫెస్ట్–2024 కార్యక్రమంలో తహసీల్దార్ పాల్గొన్నారు. గ్యాస్ లీకేజీ, అపరిచితులు ఇంట్లోకి వస్తే గుర్తించే పరికరాలు, టోల్ గేట్ ప్లాజాతోపాటు వివిధ రకాల శాస్త్ర సాంకేతిక పరికరాలతో ఆవిష్కరణలను విద్యార్థులు ప్రదర్శించి వాటి పనితీరుపై వివరించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ కె.శ్రీనివాస్, నర్సింహులపేట ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఆనందబాబు, మాస్టర్స్ ట్రైనర్ సతీష్, విద్యార్థులు పాల్గొన్నారు.

సంఘాలుగా ఏర్పడితే రైతులకు లాభాలు



సదస్సులో మాట్లాడుతున్న జయపాల్‌రెడ్డి

దంతాలపల్లి: రైతులు సంఘాలుగా ఏర్పడితే కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన అనేక సంక్షేమ పథకాలతో రైతులకు లాభాలు ఉంటాయని రైతు ఉత్పత్తిదారుల రాష్ట్ర చైర్మన్ జయపాల్‌రెడ్డి అన్నారు. మండలకేంద్రంలో బాలాజీ ఫంక్షన్‌హాలులో మంగళవారం మండల రైతు ఉత్పత్తిదారుల సంస్థ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కల్పించారు. ఈసందర్భంగా పలువురు రైతు ఉత్పత్తిదారుల సంస్థ నాయకులు మాట్లాడుతూ.. కేంద్రం ఫార్మర్ ప్రొడ్యూసర్ ఆర్గనైజేషన్ స్కీం ద్వారా రైతులకు ఆర్థికసాయం అందిస్తుందన్నారు. రైతులు సంఘాలుగా ఏర్పడి ప్రభుత్వం అందించే రాయితీలు పొందాలని కోరారు. ఈసదస్సులో సీఈఓ వినయ్, స్వామిజీ, సాయిరెడ్డి, పీఎఫ్ఓ డిచ్‌పల్లి, వ్యవసాయ అధికారి కుమార్‌యాదవ్, డైరెక్టర్లు గౌతమ్‌రెడ్డి, బట్టునాయక్, నరేష్, అధికారి దీక్షిత్, రైతులు పాల్గొన్నారు.

పూర్తయిన ‘పల్స్‌పోలియో’

గార్ల: పల్స్‌పోలియో కార్యక్రమం వందశాతం పూర్తయిందని, ప్రభుత్వ లక్ష్యం నెరవేర్చామని ప్రభుత్వ నోడల్ ఆఫీసర్ రాజ్‌కుమార్ జాదవ్ అన్నారు. మంగళవారం సంచార జీవనం గడుపుతున్న వారి పిల్లలకు సైతం పోలియో చుక్కలు వేసినట్లు ఆయన వెల్లడించారు.

డోర్నకల్: మండలంలో పల్స్‌పోలియో కార్యక్రమం మంగళవారం పూర్తయింది. లక్ష్యాన్ని మించి చిన్నారులకు పోలియో చుక్కలు వేసినట్లు వైద్యాధికారి సాధ్విజ తెలిపారు.

ప్రత్యేక పూజలు

పెద్దవంగర: మండలంలోని చిన్నవంగర గ్రామంలో ఎన్ఆర్ఐ పాకనాటి సునీల్‌రెడ్డి రూ.18లక్షలతో ఆరాధ్యదైవం శ్రీకంఠమహేశ్వరస్వామి ఆలయాన్ని నిర్మించారు. మంగళవారం ఆలయంలో బోనాలు సమర్పించి వేడుకలు చేపట్టారు. ఈ వేడుకల్లో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు పాల్గొని ఎన్ఆర్ఐతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, నాయకులు పాకనాటి సోమారెడ్డి, ముత్తినేని శ్రీనివాస్ పాల్గొన్నారు.

విద్యుత్ లైన్‌మెన్ల సేవలు వెలకట్టలేనివి



పెద్దవంగర: లైన్‌మెన్లను సన్మానిస్తున్న డీఈఈ

పెద్దవంగర: విద్యుత్ లైన్‌మెన్ల సేవలు వెలకట్టలేమని తొర్రూరు డివిజన్ డీఈఈ మధుసూదన్ , ఏడీఈ చలపతి రావు అన్నారు. జాతీయ లైన్‌మెన్ దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని వడ్డెకొత్తపల్లి గ్రామంలోని సబ్‌స్టేషన్‌లో మంగళవారం విద్యుత్ శాఖ ఆధ్వర్యంలో లైన్‌మెన్‌లను శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో విద్యుత్ శాఖ ఏఈ రమేష్ బాబు, సబ్ ఇంజనీర్ మెట్టురాం, లైన్ ఇన్‌స్పెక్టర్ వీరసోములు, లైన్‌మెన్లు బోజాలు, యాకయ్య, పవన్ కల్యాణ్, రవి కుమార్, రాజశేఖర్, వెంకన్న, వీరన్న, పుల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

గార్ల/కురవి: జాతీయ లైన్‌మెన్ దినోత్సవం సందర్భంగా విద్యుత్ డీఈ విజయ్, లైన్ ఇన్‌స్పెక్టర్ తిరుపతిరెడ్డి, లైన్‌మెన్లు ఎండి సమద్, రవి, సతీష్‌లను సన్మానించారు. కార్యక్రమంలో ఏఈ మహేంద్ర బాబు, ఫోర్‌మెన్ సాంబమూర్తి, చారి పాల్గొన్నారు.

వేడి గాలుల నుంచి కాపాడుకోవాలి



ఆయిల్‌పామ్ తోటను పరిశీలిస్తున్న అధికారి

డోర్నకల్: వేసవిలో వేడి గాలుల నుంచి పంటలను కాపాడుకునేందుకు చర్యలు చేపట్టాలని జిల్లా ఉద్యాన అధికారి జినుగు మరియన్న కోరారు. మండలంలోని ముల్కలపల్లితోపాటు పలు గ్రామాల్లో మంగళవారం మరియన్న పర్యటించి ఆయిల్‌పామ్ తోటలు, కూరగాయలు, బంతిపూల తోటలను పరిశీలించి రైతులకు పలు సూచనలు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ తోటలు సాగు చేస్తున్న రైతులు డ్రిప్ ద్వారా మొక్కలకు సక్రమంగా నీరందించాలని కోరారు. వేడి గాలుల నుంచి ఆయిల్‌పామ్ మొక్కలను కాపాడుకునేందుకు మొక్కల చుట్టూ జనుము పంటను సాగు చేయాలని సూచించారు. బంతిపూల సాగు చేస్తున్న రైతులకు వేసవిలో పాటించాల్సిన జాగ్రత్తల గురించి వివరించారు.

విద్యార్థులకు పరీక్ష సామగ్రి పంపిణీ



మహబూబాబాద్ అర్బన్: విద్యార్థులకు పరీక్ష సామగ్రి అందజేస్తున్న లింగయ్య



తొర్రూరు రూరల్: పరీక్ష ప్యాడ్లతో విద్యార్థులు

మహబూబాబాద్ అర్బన్: మానుకోట మున్సిపల్ పరిధిలోని జమాండ్లపల్లి ప్రభుత్వ పాఠశాలలో పదో తరగతి విద్యార్థులకు రిటైర్డ్ ఎంఈఓ నల్లా లింగయ్య పరీక్ష ప్యాడ్లు, పెన్నులు మంగళవారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెచ్ఎం సమ్మెట వెంకటేశ్వర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కేసముద్రం: మండలంలోని ఇంటికన్నె, ఉప్పరపల్లి, కాట్రపల్లి గ్రామాల్లో గల జెడ్పీ హైస్కూల్లో సమ్మిగౌడ్ ఫౌండేషన్ వ్యవస్థాపకుడు చిలువేరు సమ్మయ్యగౌడ్ ఆధ్వర్యంలో 60మంది పదో తరగతి విద్యార్థులకు మంగళవారం పరీక్ష ప్యాడ్లను అందజేశాడు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 10/10 సాధించిన విద్యార్థులకు నగదు బహుమతి అందజేస్తామన్నారు. కార్యక్రమంలో దామరకొండ ప్రవీణ్‌కుమార్, సామల నర్సయ్య, పెదగాని వెంకన్న, జల్లె యాకాంబ్రం, వేణుగౌడ్, తండా శ్రీనివాస్, పలుస వెంకన్న, సారంగం పాల్గొన్నారు.

పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలి

తొర్రూరు రూరల్: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధికి పాటుపడాలని గోపా జిల్లా అధ్యక్షుడు కుర్ర శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని హరిపిరాల ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో గోపా ఆధ్వర్యంలో మంగళవారం పదో తరగతి విద్యార్థులకు పరీక్షా ప్యాడ్లు అందించారు. కార్యక్రమంలో గోపా మండల అధ్యక్షుడు యాకయ్య, దాత రమేష్, నాయకులు శ్రీనివాస్, కుమార్, ముత్తిలింగం, హెచ్ఎం బీవీ రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంక్షిప్త సమాచారం

కొత్త జాబ్‌కార్డులు ఇవ్వాలి

నెహ్రూసెంటర్: గ్రామీణ ఉపాధిహామీ పథకంలో కూలీలకు ఏడాదికి 200 రోజుల పనిదినాలను కల్పించాలని ఏఐకేఎంఎస్ జిల్లా సహాయ కార్యదర్శి గుజ్జు దేవేందర్ మంగళవారం అన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధి కూలీలకు రోజుకు రూ.600 చెల్లించాలని, కొత్త జాబ్ కార్డులు ఇవ్వాలన్నారు. ఉపాధి హామీ పని దినాల తగ్గింపు చేసే కుట్రలను విరమించుకోవాలని, గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు ఉపాధి కల్పించి ఆదుకోవాలని ఆయన కోరారు.

బడ్జెట్‌లో నిధుల తగ్గింపు

మహబూబాబాద్ రూరల్: ఉపాధి పనులను తీసేయడానికి బడ్జెట్‌లో నిధులు తగ్గిస్తూ.. ఆధార్ లింకు పద్ధతులు తెచ్చి బీజేపీ సర్కార్ ఉపాధి చట్టం పేదవాడికి దక్కకుండా చేస్తుందని వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు కుర్ర మహేష్ అన్నారు. మండలంలోని వేమునూరు గ్రామంలో ఉపాధి కూలీల సమస్యలను మంగళవారం మహేష్ అడిగి తెలుసుకున్నారు.

రేపు అంగడి వేలం

నర్సింహులపేట: మండల కేంద్రంలోని అంగడి రేపు (గురువారం) వేలంను నిర్వహిస్తున్నట్లు ఎంపీఓ సోమ్‌లాల్ తెలిపారు. మండల కేంద్రంలోని జీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన మాట్లాడారు. వేలంలో పాల్గొనే వారు నిబంధనలకు లోబడి పాల్గొనాలన్నారు.

సన్మానం

మరిపెడ రూరల్: ఈనెల 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని అబ్బాయిపాలెం గ్రామ పంచాయతీ పరిధి పత్తికుంటతండా అంగన్‌వాడీ కేంద్రంలో వైద్యురాలు గుగులోతు సుచిత్రను శాలువాతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్ బెస్త సంపూర్ణ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఉచిత శిక్షణకు దరఖాస్తులు

కురవి: నిరుద్యోగ ఎస్సీ యువతీ, యువకులకు ఎస్సీ సంక్షేమ శాఖ ఏర్పాటు చేసిన గ్రూప్–1, గ్రూప్–2, గ్రూప్–4, ఆర్ఆర్‌బీ, తదితర పోస్టులకు ఉచితంగా కోచింగ్‌ను ఐదునెలల పాటు ఇవ్వనున్నట్లు తెలంగాణ అంబేడ్కర్ యువజన రాష్ట్ర ఉపాధ్యక్షుడు మిద్దెపాక ఎల్లయ్య మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తులు చేసుకోవడానికి నేడు(బుధవారం) చివరి తేదీ అన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

మట్టి, ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తొర్రూరు: అక్రమంగా తరలిస్తున్న మట్టి, ఇసుక ట్రాక్టర్లను రెవెన్యూ, పోలీసు అధికారులు పట్టుకున్న ఘటన మంగళవారం మండల పరిధిలో చోటు చేసుకుంది. మండలంలోని కంఠాయపాలెం శివారులోని ఆకేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను తరలిస్తున్న రెండు ట్రాక్టర్లను పోలీసులు పట్టుకున్నారు. దాంతో మండలంలోని వెలికట్ట శివారులో అక్రమంగా మట్టి తరలిస్తున్న మూడు ట్రాక్టర్లను ఆర్ఐ రాహుల్, రెవెన్యూ సిబ్బంది పట్టుకున్నారు. ఇసుక ట్రాక్టర్లను పోలీస్ స్టేషన్‌కు తరలించగా, మట్టి ట్రాక్టర్లను తహసీల్దారు కార్యాలయానికి తరలించారు.

7న పార్లమెంట్ స్థాయి సమావేశం

బయ్యారం: ఈనెల 7న మండలంలోని గంధంపల్లిలో ఎంఎస్‌పీ, ఎంఆర్‌పీఎస్ సంఘాల పార్లమెంట్ స్థాయి సమావేశం నిర్వహించనున్నట్లు ఎంఎస్‌పీ జాతీయ నాయకుడు గుగ్గిళ్ల పీరయ్యమాదిగ మంగళవారం తెలిపారు. ఈసమావేశానికి ముఖ్యఅతిథిగా ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణమాదిగ హాజరుకానున్నట్లు పేర్కొన్నారు. కార్యక్రమంలో నాయకులు మహేందర్, అనిల్, రమేష్, శ్రీనివాస్, శ్రీను పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి చేయూత



మహబూబాబాద్ రూరల్: మహబూబాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని 23వ వార్డు ఎన్టీఓస్ కాలనీలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన నయీం కుటుంబానికి కాంగ్రెస్ జిల్లా నాయకులు శంతన్ రామరాజు 50కిలోల బియ్యాన్ని బాధిత కుటుంబ సభ్యులకు మంగళవారం అందజేశాడు. కార్యక్రమంలో నాయకులు జహీరుద్దీన్, అలీం, జియాఉద్దీన్, కరాటే ఖాజా, ఓబీసీ స్టేట్ కోఆర్డినేటర్ పింద్రాల రాందాస్ పాల్గొన్నారు.

ఆర్థికసాయం

చిన్నగూడూరు: ఇటీవల మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ బాలికల పాఠశాలలో కుక్కర్ పేలి వర్కర్స్ పసునాది స్వప్న, కంచనపల్లి మంజులకు గాయాలయ్యాయి. విషయం తెలుసుకున్న సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగులు మంగళవారం మండల కేంద్రంలోని వారి నివాసానికి వెళ్లి పరామర్శించి వైద్య ఖర్చుల నిమిత్తం ఇద్దరికి కలిపి రూ.15వేలు ఆర్థికసాయం అందజేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష కాంట్రాక్ట్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు వీరన్న, ప్రవీణ్ కుమార్, ఐఈఆర్‌టీ సతీష్, రమేష్, మధు పాల్గొన్నారు.

పెండింగ్ రుణాలు మంజూరు చేయాలి

గార్ల: ఐటీడీఏ ద్వారా ఎస్టీ కార్పొరేషన్‌లో సెలక్ట్ అయిన లబ్ధిదారులకు వెంటనే రుణాలు అందించాలని కోరుతూ తెలంగాణ గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి బి.హరినాయక్ మంగళవారం ఎంపీడీఓ మంగమ్మకు వినతిపత్రం అందజేశారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో శాంతికుమార్, పూల్‌సింగ్, మంగీలాల్, రమేష్ ఉన్నారు.

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి



గార్ల: ఈనెల 16వ తేదీ వరకు జిల్లా కోర్టులో నిర్వహించే లోక్ అదాలత్‌లో పోలీసు కేసులు ఉన్న ఇరువర్గాలు రాజీపడితే కేసులు కొట్టివేయబడతాయని గార్లబయ్యారం సీఐ బి రవికుమార్ తెలిపారు. మంగళవారం పోలీస్‌స్టేషన్‌లో ఆయన మాట్లాడారు. రాజీపడే నేరస్తులు, ఫిర్యాదుదారులు జిల్లా కోర్టుకు వచ్చే ముందు తమ ఆధార్‌కార్డులను వెంట తీసుకొని రావాలని ఆయన సూచించారు. సమావేశంలో ఎస్సై జీనత్‌కుమార్ పాల్గొన్నారు.

వ్యాయామ ఉపాధ్యాయుడి మృతి

నెల్లికుదురు: గుండెపోటుతో వ్యాయామ ఉపాధ్యాయుడు మృతి చెందాడు. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. మహబూబాబాద్ మండలం గడ్డిగూడెం తండాకు చెందిన భూక్య కిషన్ నెల్లికుదురు మండలం ఆలేరు జెడ్పీహెచ్ఎస్‌లో వ్యాయామ ఉపాధ్యాయుడిగా విధులు నిర్వహిస్తున్నాడు. సోమవారం గుండె పోటుకు గురి కాగా ఏరియా ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉందని వరంగల్‌లోని ఓ ప్రైవేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కిషన్ మంగళవారం మృతి చెందాడు.

‘గృహజ్యోతి’ని సద్వినియోగం చేసుకోవాలి



కేసముద్రం: పేదప్రజల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన గృహజ్యోతి పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలని కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు అంబటి మహేందర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని అమీనాపురం గ్రామంలోని ఎస్సీకాలనీలో విద్యుత్ వినియోగదారులకు జీరో బిల్లులను అందజేశారు. కార్యక్రమంలో ఎంపీటీసీ అంబటి లక్ష్మీ, నాయకులు ప్రవీణ్‌కుమార్, శ్రీనివాస్‌రెడ్డి, నేతాజీ, సుధాకర్‌రెడ్డి, కట్టయ్య, కరుణాకర్, శ్రీనివాస్ పాల్గొన్నారు. అదే విధంగా కల్వల గ్రామంలో జీరో బిల్లులను పార్టీ గ్రామ అధ్యక్షుడు గండి శ్రీనివాస్ అందజేశారు. కార్యక్రమంలో శ్రీనివాస్, దేవేందర్‌రెడ్డి, ఎల్లాగౌడ్, రవి, చిన్నవెంకన్న, అనంతరాములు, సుధాకర్ పాల్గొన్నారు.